క్లుప్తంగా

థియేటర్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి : వర్షం సినిమా ప్రదర్శన సందర్భంగా తమపై దేవీ థియేటర్ సిబ్బంది దాడి చేశారని ఆరోపిస్తూ రాంనగర్‌కు చెందిన యువకులు నీరజ్, ధీరజ్, సందీప్, సుజన్‌లు, ఆదివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి.. తమకు టికెట్లు ఉన్నప్పటికీ సిబ్బంది టిక్కెట్లు చూడకుండా తమను కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మద్యం తాగి దాడి చేసిన వారిపై సిబ్బందిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్టేజీ, స్క్రీన్‌పై ఎక్కడంతో గొడవ జరిగిందిని దీంతో తమ సిబ్బంది వారించడంతో గొడవజరిగిందని థియేటర్ మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్‌లు చెబుతున్నారు. కేసు నమోదుచేశామని, వారిపై విచారించి చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి సీఐ సీతయ్య తెలిపారు.

లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న కోదండరామ్

చిక్కడపల్లి: ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంచుకుని లక్ష్యం వైపు విద్యార్థులు, యువత ముందుకు సాగాలని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగిన వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే దిశగా అడుగు వేయాలన్నారు. జెఎన్‌టియు పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.మంజూర్ హుస్సేన్ పాల్గొన్నారు.

బీసీ బంధు ఆర్థికసాయం అందజేయాలి

ముషీరాబాద్: బీసీ బంధు లబ్దిదారులకు రెండవ విడత ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని జిల్లా రజక వెల్ఫేర్ కమిటీ సభ్యులు ముదిగొండ మురళీ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం గ్రేటర్ హైదరాబాద్‌లోని కొన్ని నియోజకవర్గాల్లో మొదటి విడత, రెండవ విడతలు చెక్కుల పంపిణీ చేశారన్నారు. ఎన్నికల కోడ్ మూలంగా మరికొన్ని నియోజకవర్గాల్లో రెండవ విడత చెక్కుల పంపిణీ పూర్తి కాలేదని తెలిపారు.

ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రెడ్డిమల్ల పార్వతి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ(బొజ్జ తారకం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రాంనగర్‌కు చెందిన రెడ్డిమల్ల పార్వతిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జన్ను సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ కోరుకున్న అన్ని రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పార్వతిని రాష్ట్ర కార్యవర్గంలో నియమించినట్లు తెలిపారు.

మేడారానికి పాదయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డి రెండు విడతలుగా పదేళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందించాలని ఓయూ జేఏసీ ఛైర్మన్ ఒరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో మేడారానికి పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ దేవతల వద్దకు కాలినడకన బయలుదేరారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం సహకరించాలని బీఆర్ఎస్ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్‌లాల్, యాదగిరి, నరసింహ, సురేష్, సాయి, యాదగిరి, నగేష్, వంశీ పాల్గొన్నారు.

మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు మహిళా శక్తి సిద్ధం



అబిడ్స్: కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మరోసారి ప్రధానమంతి అయ్యేందుకు మహిళా శక్తి సిద్ధంగా ఉందని రాష్ట్ర బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ భీశ్వ సురేఖ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీలో జరిగిన మహిళా మోర్చా సమావేశంలో వారు మాట్లాడుతూ..తెలంగాణలో హైదరాబాద్ పార్లమెంట్‌తో పాటు అన్ని పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహిళలంతా ఏకమై బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేసి బీజేపీని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ ఈశ్వరయ్య, ప్రొఫెసర్ లక్ష్మణ్, డాక్టర్ వినయ్‌కుమార్ తదితరులు



తెలుగు కవిత్వ పరిణామం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్ గోపి, వేణుగోపాల్ తదితరులు

డాక్టర్ శివశంకర్‌కు భారతరత్న ఇవ్వాలి

– జస్టిస్ ఈశ్వరయ్య

కవాడిగూడ: న్యాయవ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మహాయోధుడు, బీసీల పక్షపాతి డాక్టర్ పి.శివశంకర్. నవతరానికి మార్గదర్శకుడని జస్టిస్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో భాగంగా ఆదివారం గద్దర్ ప్రాంగణంలోని రవ్వా శ్రీహరి వేదికపై పి.శివశంకర్ ఆత్మకథ ''అదొక్కటే ముగింపు'' పుస్తకంపై చర్చాకార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, సమన్వయ కర్తగా వ్యవహరించగా జస్టిస్ ఈశ్వరయ్య, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ... భారతరత్న అవార్డు పొందడానికి అన్ని అర్హతలు గల వ్యక్తి పి. శివశంకర్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో జ్యోతిరావు పూలే ఆరోచనలకు దారి చూపిన వ్యక్తి అని వివరించారు.

పుస్తకావిష్కరణ

కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలోని గద్దర్ ప్రాంగణంలో జరుగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో భాగంగా డాక్టర్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి రచించిన తెలుగు కవిత్వ పరిణామం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ వేణు గోపాల్, ఆచార్య ఎస్ గోపి, సాహితీ వేత్త డాక్టర్ పసునూరి రవీందర్ హాజరయ్యారు.

బోధన, బోధనేతర సిబ్బందికి సముచిత వేతనాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కత్తి వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి 12 నెలలతో కూడిన సముచిత వేతనాలు ఇవ్వాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డులు ప్రభుత్వ సెలవు దినాలను అమలు చేయాలని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కత్తి వెంకటస్వామి మాట్లాడారు. మోడల్ స్కూల్స్, పీజీటీ, టీజీటీల ప్రమోషన్స్, ట్రాన్స్‌ఫర్స్‌ను వెంటనే చేపట్టాలని రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు, కాలేజ్‌లు, పాఠశాలల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, బీఈడీ, గురుకులాలు, స్థానిక విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీ నిబంధనలను అనుగుణంగా పీజీ కళాశాలల్లో పని చేస్తున్న వారికి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు ఎం.రామకృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వేణు, శరీఫ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంతరంగపు ముచ్చట్లు పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత డాక్టర్ సూర్యదేవర రాధారాణి రచించిన అంతరంగపు ముచ్చట్లు పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు యూనివర్సిటీ మాజీ ఉపకులపతి డాక్టర్ ఎన్.గోపి ఆవిష్కరించారు. సామాజిక వేత్త డాక్టర్ ఎస్.వి.నారాయణ 3వ వర్ధంతిని పురస్కరించుకోని ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.గోపి మాట్లాడుతూ అంతరంగపు ముచ్చట్లు పుస్తకంలో ప్రగతి శీల భావాలతో పాటు సామాజిక అంశాలు ఉన్నాయని అన్నారు. మానవీయ కుటుంబం నుంచి వచ్చిన రాధారాణి సృజనాత్మకమైన కావ్యాన్ని రచించారని అన్నారు. మౌనం ఎంత పండితే శబ్దం అంత భయంకరంగా ఉంటుందని తన పుస్తకంలో పేర్కొన్నారని తెలిపారు. పుస్తక తొలి ప్రతిని సూర్యనారాయణ రాంమోహన్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ శ్రీవాద రచయిత ఓల్గా, ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్, డాక్టర్ ఎస్.రఘు, డాక్టర్ జతీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎన్.గోపి తదితరులు

ప్రభుత్వం మారినా బీసీలపై కొనసాగుతున్న వివక్ష

కాచిగూడ : తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సమగ్ర కుల గణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కులగణన తీర్మానం అస్పష్టంగా ఉందని, దీనికి జ్యూడిషియల్ కమీషన్ లేదా ప్రత్యేక బిల్లు ప్రవేశ పెడితే తెలంగాణ ప్రజలకు ఉపయోగంగా ఉండేదన్నారు. తెలంగాణలో ప్రభుత్వం మారినా బీసీలపై వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొటుపల్లి సురేష్, తెలంగాణ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ జలపల్లి కిరణ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పండరినాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

మానవహక్కుల పరిరక్షణకు కృషి

కవాడిగూడ: ప్రజల ప్రాథమిక హక్కుల కోసం పోరాటం చేస్తానని ప్రపంచ మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర సహాయకార్యదర్శి దండుగుల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ప్రపంచ మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నవోదయ సిద్దు చేతుల మీదుగా మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర సహ కార్యదర్శిగా దండుగుల రామకృష్ణకు నియామక పత్రాన్ని అందజేశారు. బలహీన వర్గాల హక్కులను కొంతమంది అధికార బలంలో కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నవోదయ సిద్దు దండుగుల రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న దండుగుల రామకృష్ణ

క్రీడాకారులకు సర్కారు చేయూతనివ్వాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకారం అందించాలని నగర గ్రంథాలయ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నేషనల్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ కరాటే పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాతబస్తీలో క్రీడాకారులకు ఎంతో చేయూతనందించామన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. క్రీడారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణిస్తారన్నారు.

తెలంగాణ అబ్బాయి..అమెరికా అమ్మాయి..



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సు . దీర్‌రెడ్డి సోదరుడు నారాయణ రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి నితిన్ వివాహం ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో అమెరికాకు చెందిన డాక్టర్ విట్నీ స్నిడర్‌తో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వామ్మో ఉప్పల్ రోడ్లు

అస్తవ్యస్తంగా వరంగల్ జాతీయ రహదారి

- నిత్యం అవస్థలు పడుతున్న వాహనదారులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగానే..
- ఇటువైపు కన్నెత్తి చూడని అధికారులు

ఉప్పల్: ఈ రోడ్డును చూడండి.. కాదు కాదు ఒక్కసారి ఈ దారి మీదుగా వెళ్లండి.. ఎక్కడో మారుమూల గ్రామాల్లో చూసినట్లు అనిపించడం లేదు.. అలా అనుకుంటే పొరపడినట్లే.. అదేనండి ఉప్పల్ మీదుగా వెళ్లే భూపాలపట్నం 163 జాతీయ రహదారి ఇది. ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ వద్ద రోడ్డు పరిస్థితి ఇలా మారింది. ఒక్కరోజు కాదు ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా అధికారులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా అనిపించకపోవడం శోచనీయం. కంకర తేలి వెక్కిరిస్తున్నా పట్టింపు లేకుండా పోయింది.

కారిడార్ పూర్తయ్యేది ఎప్పుడో..?

24 గంటల పాటు నిత్యం రద్దీగా ఉండే ఉప్పల్–వరంగల్ జాతీయ రహదారి యాదాద్రికి, వరంగల్ హన్మకొండ ఇతర ముఖ్యప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నిత్య వీఐపీల తాకిడి కూడా ఉంటుంది. అయినా ఈ రహదారిని పట్టించుకునే నాథుడే లేడు. కారిడార్ రోడ్డు వెడల్పులో భాగంగా పనులు ప్రారంభించి వదిలేశారు. కారిడార్ పనులు పూర్తయితే గానీ రోడ్డు వేయలేమంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు భీష్మించుకు కూర్చున్నారు. కానీ కారిడార్ పూర్తయ్యేది ఎప్పుడో.. ఈ రోడ్డుకు మోక్షం వచ్చేది ఎప్పుడో ఆ దేవుడికె తెలియాలి.



ఉప్పల్ విద్యుత్ జంక్షన్ వద్ద వరంగల్ జాతీయ రహదారి పరిస్థితి ఇది

తాత్కాలికంగా రోడ్డు వేయాలని..

నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో కారిడార్ పనులు కొనసాగుతున్నాయి. ఒకపక్క భారికేడ్లు మరోపక్క కంకర తేలిన రోడ్డు.. మరోపక్క కబరస్తాన్ ఆపై రోడ్డు మీదకు చేరుతున్న మురుగు నీరు.. ఇంకేముంది రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఉదయాన్నే స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ అధికారులు శ్రమించాల్సి వస్తోంది. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్ల చెరువు వరకు దాదాపు 2 కిలో మీటర్లు వరకు రోడ్డంతా కంకర తేలి దుమ్ముతో నిండిపోయిన పరిస్థితి. కారిడార్ పనులు పూర్తయ్యే వరకు అర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

అబిడ్స్: బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీసీల ప్రగతి, సంక్షేమం జరుగుతుందన్నారు. ఓబీసీ సెల్ జాయింట్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన నిర్మల్‌కుమార్ యాదవ్‌ను ఉపరాస్ వ్యాయామశాల నిర్వాహకులు ఉదయ్ పహిల్వాన్, జయదీప్ యాదవ్, బజరంగ్‌లాల్ యాదవ్‌తో పాటు పలువురు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలంతా ఐక్యమై కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్ యాదవ్, నర్సింగ్ యాదవ్, రఘునందన్ యాదవ్, అంగాద్‌యాదవ్, కిషన్‌లాల్ పహిల్వాన్, శంకర్ మహారాజ్ పాల్గొన్నారు.



హక్కుల సాధనకు బీసీ కులగణన దోహదపడుతుంది

అంబర్‌పేట: రాష్ట్రంలో బీసీ కులగణనంతో అందరికి సమన్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని పురస్కరించుకుని ఆదివారం అంబర్‌పేట మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. వీహెచ్ ముఖ్య అతిథితిగా విచ్చేసి జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీనవర్గాల కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు మేలు చేస్తాయి



కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని సీఈ కాలనీలో పార్కులో మీనాక్షి కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరాన్ని కాలనీ వాసులు సద్వినియోగం చేసుకున్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి స్వచ్ఛందంగా ప్రైవేటు ఆస్పత్రుల వారు ముందుకు రావాలని కార్పొరేటర్ కోరారు. కాలనీ కార్యదర్శి వెంకట్రావ్, ఇతర కాలనీ ప్రతినిధులు, ఆస్పత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని దేవునితోట ప్రాంగణంలో ముషీరాబాద్‌లోని రేడియంట్ హైస్కూల్ 60వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు రావాలంటే విద్యార్థులు చిన్ననాటి నుంచే బాగా చదువుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటి సీనియర్ నాయకులు ముఠా జైసింహ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఆదినారాయణకు పలువురి నివాళి



ప్రొఫెసర్ ఆదినారాయణ సంస్మరణ సభలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జనవిజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.ఆదినారాయణ సంస్మరణ సభను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆదినారాయణ చేసిన కృషిని మరువలేమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కోయ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి శ్రీనాథ్, ఓయూ మాజీ వీసీ తిరుపతిరావు, జేవీవీ కోశాధికారి వరప్రసాద్, ఆదినారాయణ కుమారుడు ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చదివే పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు చేయూతనివ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య విజ్ఞప్తి చేశారు. ఓయూలో చదివి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడి యూనివర్సిటీకి కోట్ల రూపాయాలు విరాళంగా అందచేస్తున్న పూర్వ విద్యార్థులు సదస్సులు, సన్మానాలు, సంబరాలే కాకుండా పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. ఫీజులు పెరిగి, ఫెలోషిప్, స్కాలర్‌షిప్ అందని విద్యార్థులకు ఓయూ పూర్వవిద్యార్థుల సంఘం అలూమ్నీ పేరుమీద నెలకు రూ.15 వేల ఫెలోషిప్ అందజేయాలని సూచించారు. ఓయూ బోధన, పరిశోధన కుంటుపడిందని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర ఉద్యోగాల భర్తీకి కృషి చేయాలన్నారు.

మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శం



ఉస్మానియా యూనివర్సిటీ: మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శమని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నాను సైదులు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్ నిజాం సంస్థానంలో విద్యా మంత్రిగా పనిచేసి దళిత బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి మహిళల విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుర్గం వినోద్, కరుణకర్, గోవర్ధన్, హరికృష్ణ, నగేష్ పాల్గొన్నారు.